## క్లుప్తంగా

### లోక్ అదాలత్‌లో 231 కేసులు పరిష్కారం

మార్కాపురం: మార్కాపురం కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 231 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. మొత్తం 3 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి, సీనియర్ సివిల్ జడ్జి దేవేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కిశోర్‌కుమార్‌లు ప్రిసైడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో పలు గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని హనుమంతరాయునిపల్లె, కసినేపల్లె, గోహరపల్లె, కొత్తపల్లె, ఓబులాపురం, మలికేపల్లె, కూరాకువానిపల్లె, చింతలపల్లె, వర్ధనపల్లె గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

### కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్


కలెక్టర్‌కు మొక్క ఇస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: నూతన జిల్లా కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన రాజబాబును శనివారం ఒంగోలు వెళ్లి మార్కాపురం తహసీల్దార్ చిరంజీవి పూలమొక్క ఇచ్చి కలిశారు. రెవెన్యూ పరంగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారు.

### పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవిచంద్ర


రవిచంద్ర

మార్కాపురం టౌన్: పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఎం.రవిచంద్రకుమార్ ఎన్నికయ్యారు. శనివారం ఆయన మార్కాపురంలో వివరాలు తెలిపారు. ఈ నెల 13న గుంటూరులోని బ్రాడీపేటలో జరిగిన రాష్ట్ర సమావేశంలో అధ్యక్షునిగా సంపత్‌కృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు. 26 జిల్లాల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకులుగా జె.లక్ష్మీకాంత్, ఎంఎస్ఎన్ ప్రసాద్‌లు వ్యవహరించినట్లు తెలిపారు.

### హనుమంతరెడ్డికి సాయి ప్రజాసేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న హనుమంతారెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ రామకృష్ణ ధ్యానమందిరం నిర్వాహకుడు, యోగివేమన తపోవనం ఆధ్యాత్మిక ఆశ్రమం అధ్యక్షుడు పి.హనుమంతారెడ్డి సాయిప్రజా సేవా రత్న అవార్డు అందుకున్నారు. చిలకలూరిపేట జయ జయ సాయి ట్రస్టు ఆధ్వర్యంలో దత్తసాయి అన్నదాన సమాజం వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు సాయి ప్రజా సేవా రత్న అవార్డును అందజేశారు. హనుమంతారెడ్డి కొన్ని సంవత్సరాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఎంతో శ్రద్ధతో నిర్వహిస్తూ పలువురిని ఆధ్యాత్మిక ప్రసంగాలతో ఆకట్టుకున్న వ్యక్తిగా పేరొందారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రశంసించారు.

### తిరుమలనాథ స్వామికి పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత గొడ్రాలికొండ తిరుమల నాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టు దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కుబడులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

# కొత్త పింఛన్.. ఎప్పుడిస్తారో..!

- కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నరైనా ఓపెన్ కాని సైట్
- వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఎదురుచూపులు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్హులు
- కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటిని తొలగించే కుట్ర


రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్లు ఇవ్వకపోవడంతో ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

బేస్తవారిపేట:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కొత్త పింఛన్‌లకు మోక్షం లభించడంలేదు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు నిత్యం ఆయా గ్రామాల పరిధిలోని సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త పింఛన్లు ఇంకా ఇవ్వడం లేదని అధికారులు తేల్చేయడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు.

**ఎన్నికల నోటిఫికేషన్‌తో ఆగిన సైట్..**

2024 ఏప్రిల్ 18 నుంచి సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో పింఛన్ల సైట్ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఇంకా ఓపెన్ చేయకపోవడంపై ప్రజలు సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. పింఛన్ల కోసం 60 ఏళ్లు నిండిన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటి వరకు గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో అన్ని రకాల పింఛన్ అర్హులు 5 వేల మంది ఉన్నారు.

**హామీకే పరిమితమైన 50 ఏళ్లకే పింఛన్:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటూ టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక నెలలు గడుస్తున్నా ఆ హామీ మాటే ఎత్తడంలేదు. ఇప్పటిదాకా సైట్ ఓపెన్ చేయకపోవడంతో అర్హులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అరకొరగా స్పౌజ్ పింఛన్లు..**

వృద్ధాప్య పింఛన్ తీసుకునే భర్త చనిపోతే స్పౌజ్ కేటగిరీ కింద భార్యకు పింఛన్ ఇస్తున్నారు. ఇదికూడా అరకొరగా గత నాలుగు నెలలుగా ఇస్తున్నారు. ఎటువంటి పింఛన్ తీసుకోని కుటుంబాల్లో 60 ఏళ్లు దాటినా, భర్త చనిపోయినా పింఛన్ ఇచ్చే పరిస్థితి లేదు. టీడీపీ పాత పాలనను గుర్తుకు తెస్తోందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గత వైఎస్సార్ సీపీ పాలనలో..**

గత వైఎస్సార్ సీపీ పాలనలో పింఛన్లు, రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగించింది. ఇంటి వద్దకే వెళ్లి వలంటీర్లు దరఖాస్తులు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయించేవారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా అర్హులకు పింఛన్లు మంజూరయ్యేవి. నేడు కూటమి పాలనలో దీనికి భిన్నంగా ఉంటుందని అర్హులు వాపోతున్నారు.

**పింఛన్ల తొలగింపునకు కుట్ర..**

కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లు తొలగించే పనిలో కూటమి ప్రభుత్వం నిమగ్నమైంది. రీవెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లే కాకుండా వృద్ధాప్య పింఛన్ల తొలగింపునకు కుట్రపన్నారు. గ్రామాల్లో టీడీపీ నాయకుల కోరిక మేరకు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు చెందిన వందల సంఖ్యలో పింఛన్లు తొలగింపు కుట్రలకు తెరలేపారు.

**గత ఏడాది నుంచి ఎదురుచూపులు**


నాకు ఇప్పటికే 62 సంవత్సరాలు వచ్చాయి. గత ఏడాది ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో దరఖాస్తు పెట్టుకున్నా. ఎన్నికల సమయంలో కొత్త పింఛన్లు ఇవ్వలేదు. అప్పటి నుంచి పింఛన్ కోసం ఎదురుచూపులు చూస్తున్నాను.

– పొల్లా పెద్ద తిరుపతయ్య, పూసలపాడు

**సైట్ ఓపెన్ కాలేదంటున్నారు**


నాకు 61 సంవత్సరాలు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వెళ్తే ఇంకా కొత్త పింఛన్‌ల కోసం సైట్ ఓపెన్ అవ్వలేదని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కొత్త పింఛన్‌కు సంబంధించి సమాచారం రాలేదని చెబుతున్నారు.

– గవ్వల చిన్న యల్లయ్య, నేకునాంబాద్

**కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో ఏమో**


కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారో అర్థం కావడంలేదు. నాకు 61 సంవత్సరాలు దాటాయి. పింఛన్ కోసం అప్లికేషన్ పెట్టుకుందామంటే సచివాలయ సిబ్బంది ఇప్పుడు కాదంటున్నారు. ఎన్నిసార్లు సచివాలయానికి వెళ్లినా ఇంకా అనుమతులు రాలేదంటున్నారు.

– మల్లెల వెంకటరెడ్డి, పూసలపాడు

## మృతిచెందిన గురువు కుటుంబానికి శిష్యుల చేయూత


గురువు కుమారుడికి చెక్కు అందజేస్తున్న గ్రామస్తులు

బేస్తవారిపేట: మృతిచెందిన గురువు కుటుంబానికి శిష్యులు ఆర్థిక సహకారాన్ని అందించారు. మండలంలోని పందిళ్లపల్లెలో పది రోజుల క్రితం జాగర్లమూడి గురునాథశర్మ మృతిచెందారు. 40 ఏళ్ల క్రితం గురునాథశర్మ గ్రామానికి వచ్చారు. గ్రామంలోనే ట్యూషన్ చెబుతూ, పూజారిగా స్థిరపడ్డారు. ఆయన చూపిన బాటలో నడిచిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో నిలబడ్డారు. ఈ నేపథ్యంలో గురువు కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.3 లక్షల చెక్కును శనివారం గురువు కుమారుడు రామాంజనేయశర్మకు అందజేశారు. గతంలో రూ.5 లక్షల నగదు, గ్రామంలోనే ఓ గృహం కట్టించి తమ భవిష్యత్‌కు బాటలు వేసిన గురువుకు గురుదక్షిణగా సమర్పించారు. చిన్నతనంలో గ్రామంలోని పిల్లలకు విద్యనందించిన గురువు కుటుంబానికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు.

## సంఘటితంగా ఉంటే సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

గిద్దలూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించుకునేందుకు సంఘటితంగా ఉండాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ లో ఉన్న డీఏలు, 11 వ పీఆర్‌సీ అరియర్స్, 2003 డీఎస్సీ వారిని 57 మెమో ప్రకారం ఓపీఎస్‌గా పరిగణించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కొమరోలు, గిద్దలూరు, రాచర్ల మండలాలకు అధ్యక్షులను ఎన్నుకున్నారు. అనంతరం వారి డిమాండ్ల పత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ని కలసి అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు టి.సుబ్బారాయుడు, శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్ఎంయూ ఉద్యోగుల నిరసన


నల్ల రిబ్బన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

పొదిలి: ఈహెచ్ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ శనివారం పొదిలి ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ అధ్యక్షుడు ఎస్‌కే వలి, నాయకులు జీవీ నారాయణ, కృష్ణ మాట్లాడుతూ పొదిలి డిపోలో పని చేస్తున్న మహిళా కండక్టర్ జీవీ లక్ష్మి భర్త అనారోగ్యంతో వైద్యం కోసం ప్రైవేటు వైద్యశాలలో చేర్పగా అక్కడ ఈహెచ్ఎస్ అమలు కాకపోవడంతో ఆర్థిక పరిస్థితి సహకరించక ఒంగోలు రిమ్స్ హాస్పటల్‌లో చేర్చినట్లు చెప్పారు. అక్కడ వైద్య సేవలు పొందుతూ పరిస్థితి విషమించి మరణించాడని వారు విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి మరే ఉద్యోగికి రాకూడదని, ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు కొంతమందికి ఈహెచ్ఎస్ అమలవుతుండగా మరికొంత మందికి కావడం లేదన్నారు. గతంలో ఉన్న పాత పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ అమలై ఉంటే కండక్టర్ భర్త మరణించే వాడు కాదని, ఈహెచ్ఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు.

## కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

గిద్దలూరు రూరల్: శ్మశానంలో వృత్తి కొనసాగించే కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని శ్మశానంలో గుంటలు తీసి పూడ్చే కాల్చే కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.డి.ఆనంద్‌బాబు అన్నారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో కాటికాపరుల సమస్యలపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్మశానంలో వృత్తిని కొనసాగించే కాటికాపరులను ప్రభుత్వం నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగులుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్ధాకలితో శ్మశానంలో వృత్తులను కొనసాగించే వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాటికాపరులను ఐక్యమం చేసి వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.రఘురామ్, పెద్దన్న, సురేష్, సుధాకర్, డేవిడ్‌రాజు, సీఐటీయు నాయకుడు టి.ఆవులయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి పరవశం..శ్రీవారికి పూజలు


రామదూతక్షేత్రంలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయా నమోనమఃఅంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా..గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకలు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వర స్వామి

అర్ధవీడు: మండలంలోని మాగుటూరులో పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని ప్రత్యేకంగా పూలు, పూలమాలలతో అలంకరించారు. హోమాలు చేశారు. తలనీలాలు సమర్పించి భక్తులు ముక్కులు తీర్చుకున్నారు. అనంతరం భజన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## చెన్నకేశవునికి శాంతి కల్యాణం


ఉభయ దేవేరులతో స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్య రంగ మండపంలో అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామి వారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం: డివిజన్ కేంద్రం మార్కాపురం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పేరుకుపోయిన చెత్తను శనివారం మున్సిపల్ సిబ్బంది వచ్చి తొలగించారు. ఈ నెల 7వ తేదీన సాక్షిలో 'చెత్త సృష్టి కేంద్రమా..ఎంపీడీఓ కార్యాలయమా' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చెట్టు కొమ్మలు, ఇతర చెత్తంతా పేరుకుపోయింది. దుర్గంధం వ్యాపిస్తోంది. కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలను దోమలు కాటేస్తున్నాయి. అపరిశుభ్ర వాతావరణంలో ఎంపీడీఓ కార్యాలయం ఉండటాన్ని సాక్షి ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు శనివారం చెత్తను ట్రాక్టర్‌లోకి ఎత్తి తీసుకెళ్లారు.


సాక్షి

చెత్త సృష్టి కేంద్రమా.. ఎంపీడీఓ కార్యాలయమా?

సాక్షిలో ప్రచురించిన కథనం

## వాహనాలున్నా..ఉపయోగం సున్నా..


తుప్పపడుతున్న చెత్త సేకరణ రిక్షాలు

- తుప్పపడుతున్న ట్రాక్టర్, చెత్త సేకరణ రిక్షాలు

రాచర్ల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు చెత్త తరలించడానికి మంజూరైన వాహనాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనాలు శిథిలావస్థలకు చేరుకుంటున్నాయి. మండల కేంద్రంలోని చెత్తను తరలించడానికి ట్రాక్టర్‌తో పాటు ట్రాలీ మంజూరు చేసింది. చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులకు చెత్తను తరలించేందుకు ట్రాక్టర్ వినియోగించకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న పంచాయతీ కార్యాలయం పక్కనే ట్రాక్టర్ దిష్టిబొమ్మలా పడి ఉంది. అంతేకాక సచివాలయం పక్కనే ట్రాక్టర్ ట్రాలీ చిల్లకంపల్లో నిండిపోయి తుప్పుపట్టిపోతోంది. చెత్త సేకరణ కోసం రిక్షాలు మంజూరు కాగా కొద్ది నెలలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పంచాయతీ కార్యాలయం పక్కన వేయడంతో తుప్పుపట్టిపోతోంది. చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికుల చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా ఎక్కడబడితే అక్కడ వేసి కాల్చిపడేస్తున్నారు. నిరుపయోగంగా మూలనపడిన వాహనాల గురించి ఈఓఆర్‌డీ వెంకటేష్‌ను వివరణ కోరగా ట్రాక్టర్ సంబంధించిన ట్రాలీ టైర్లు అరిగిపోవడంతో ట్రాక్టర్‌ను వినియోగించడం లేదని ఆయన తెలిపారు.


రాచర్ల పంచాయతీ కార్యాలయం పక్కన నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్


చిల్లకంపల్లో నిండిపోయిన ట్రాక్టర్ ట్రాలీ